ఆకట్టుకున్న స్వర్ దీపావళి

గచ్చిబౌలి: మహారాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన స్వర్ దీపావళి సంగీత కచేరీ అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం ఉదయం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో తత్వఆర్ట్స్, కేశవ్ మెమోరియల్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌లు సంయుక్తంగా దీపావళి హట్- స్వర్ దీపావళి పేరిట సంగీత కచేరీ నిర్వహించారు. చారుదత్ అపాలే వాయిద్య సహకారంతో విదూషీ మంజుషాపాటిల్ ప్రదర్శించిన శత్రియా, సుగం సంగీతం ఆకట్టుకుంది.

గ్యార్వి ముబారక్ షరీఫ్ ఉత్సవం

మాదాపూర్: మాదాపూర్ డివిజన్‌లోని ఖానామెట్‌లో గ్యార్వి షరీఫ్ ముబారక్ ఉత్సవాల్లో కార్పొరేటర్ హమీద్‌పటేల్‌తో కలిసి స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీక గ్యార్వి షరీఫ్ ఉత్సవమని తెలిపారు. ఎంతో పవిత్రంగా కొలిచే గ్యార్వి షరీఫ్ ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలు, శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు. ముస్లిం మతపెద్దలు, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వజ్రాభరణాలపై పెరిగిన ఆసక్తి

సాక్షి, సిటీబ్యూరో: నగర మహిళల్లో వజ్రాభరణాలపై ఆసక్తి బాగా పెరిగిందని, ముఖ్యంగా బ్రాండెడ్ డైమండ్స్‌కి డిమాండ్ ఉందని నిపుణులు తెలిపారు. మాదాపూర్‌లోని ఇనార్బిట్‌మాల్‌లో ఆదివారం కిస్నా ఆభరణాల బ్రాండ్ లాంచ్ కార్యక్రమంలో విభిన్న రకాల వజ్రాభరణాల వైవిధ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వక్తలు వజ్రాభరణాల విశేషాలను వివరించారు. ఘనశ్యామ్ డోలాకియా, పరాగ్‌షా తదితర జువెలరీ రంగ నిపుణులు పాల్గొని మాట్లాడారు.

అర కిలోమీటర్.. అరగంట..

- జాతీయ రహదారిపై వాహనాల పార్కింగ్
- రోడ్డు విస్తరణ.. పార్కింగ్ సమస్య

హఫీజ్‌పేట్ : చందానగర్ జాతీయ రహదారిపై చేపట్టనున్న ఫ్లైఓవర్, రోడ్డు విస్తరణ పనులు..మరోవైపు రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఫ్లైఓవర్ పనులు ప్రారంభించాలంటే వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ముందుగా సర్వీస్ రోడ్డు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో చందానగర్ ప్రధాన రోడ్డుపై ఉన్న వ్యాపార సముదాయాలకు వచ్చే వారు కార్లు, ద్విచక్ర వాహనాలు జాతీయ రహదారిపై పార్క్ చేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఆలస్యం కలుగుతోంది. షాపింగ్‌కు వచ్చే వారి వాహనాల పార్కింగ్‌ను వేరే చోట ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రహదారి విస్తరణ చేస్తున్న రోడ్డుపై వాహనాల పార్కింగ్

- హైదరాబాద్, ముంబాయి జాతీయ రహదారి కావడంతో భారీగా వ్యాపారాలు, వాహనాలతో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది.
- వాహనదారులు రోడ్డుపైనే పార్క్ చేస్తుండడంతో సమస్యలు వస్తున్నాయి.
- చందానగర్-లింగంపల్లి నాలా వరకు ఇదే పరిస్థితి
- ఉదయం, సాయంత్రం వేళ వాహనాల రద్దీతో అరకిలోమీటర్ దూరం అరగంట పడుతోంది. రోడ్లపై గుంతలతో వాహనదారుల అవస్థలు వర్ణాతీతం.
- దుకాణాల ముందు నిర్మిస్తున్న మురుగు కాలువ పనులు అసంపూర్తిగా ఉండడంతో మురుగు చేరుతోంది. దీంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి.
- జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మిస్తున్నట్టు సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.





పార్కింగ్‌కు ప్రత్యామ్నాయం చూపాలి



చందానగర్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలకు వచ్చే వారికి పార్కింగ్‌కు ప్రత్యామ్నాయం చూడాలి. రోడ్డుపై వాహనాలు నిలుపడంతో ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. రానున్న రోజుల్లో సమస్య పెరిగే అవకాశముంది. -శ్రీనివాస్, చందానగర్

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ పనుల సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి. రోడ్డు పనులు జరుగుతున్న సందర్భంగా తప్పనిసరిగా వాహనదారులకు కనబడే విధంగా బోర్డులు పెట్టాలి. బోర్డులు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - రామకృష్ణ గౌడ్, చందానగర్

బీఆర్ఎస్‌లోకి చేరికలు



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యేగాంధీ

రాయదుర్గం: బీఆర్ఎస్ పార్టీలో 100 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆదివారం సాయంత్రం చేరారు. వారికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కొత్త, పాత కలయికతో అందరూ సమిష్టిగా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ హయాంలో పెద్దఎత్తున నిధులు మంజూరు చేసి గతంలో ఎన్నడూ.. లేనివిధంగా అభివృద్ధి చేయడానికి అవకాశం కలిగిందన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి అందరూ పార్టీలో చేరడానికి ముందుకొస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజునాయక్, రమేష్‌గౌడ్, అంజమ్మ, గోవింద్, నారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

చందానగర్‌లో జోరుగా ఇంటింటి ప్రచారం..



అభివృద్ధి పనులను వివరిస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీ, అర్జున్ రెడ్డి, శుభోదయ కాలనీలలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి బీఆర్ఎస్ పార్టీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీకి విశేష స్పందన లభిస్తుందని, సీఎం కేసీఆర్ నిరుపేదలకు అండగా నిలబడి వివిధ రకాల అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించారన్నారు. అభివృద్ధి చూసి ఓటు వేయాలని ఆమె కోరారు. బీఆర్ఎస్ పార్టీ మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తే శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి ఆగకూడదంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు విశాల్, బలరాంసింగ్, విష్ణు, సాయిప్రసాద్, బాబురావు, బిగ్గన్న, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్, భవానిచౌదరి తదితరులున్నారు.

'బీఆర్ఎస్ పార్టీదే హ్యాట్రిక్'

పలు కాలనీవాసులతో ఆత్మీయ సమ్మేళనం, ఎన్నికల ప్రచారం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి గాంధీ

గచ్చిబౌలి/రాయదుర్గం: రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీదే హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మరోసారి సీఎంగా కేసీఆర్ కావడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి డివిజన్ సెంట్రల్ పార్కు ఫేస్-2 కాలనీవాసులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. శేరిలింగంపల్లిలో కూడా భారీ మెజార్టీతో గెలిచి గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా : ఎమ్మెల్యే గాంధీ

తొమ్మిదిన్నరేళ్లుగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ప్రజా సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. మైహోమ్ మంగళ అపార్ట్‌మెంట్‌వాసులతో ఆయన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీవాసులు సంపూర్ణ మద్దతు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. రోడ్ల విస్తరణ, లింకు రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, చెరువుల సుందరీకరణ, థీమ్ పార్కులు, ఇతర అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. సంక్షేమ పథకాలను అమలులో దేశానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

- గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో మాజీ కార్పొరేటర్ సాయిబాబాతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. నాయకులు రాజునాయక్, గణేష్‌ముదిరాజ్, శ్రీనుపటేల్, రాజుయాదవ్, ప్రవీణ్, సంపత్, దేవేందర్, జంగయ్యయాదవ్, సతీష్, నరేష్, అంజమ్మ, రాజు రమేష్‌గౌడ్, నారాయణ, గోవింద్, జగదీష్, భిక్షపతి పాల్గొన్నారు. అనంతరం పురాతన వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు స్వామి వారిని దర్శించుకున్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



చందానగర్‌లో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అష్టవింశ 28వ బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటలకు ఉత్సవాన్తస్నపనం, 10.30 గంటలకు జగత్ కల్యాణ నిమిత్తం స్వామివారి మహాకల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు హారతి తీర్థప్రసాదములు భక్తులకు అందించారు. ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ చేశారు. శ్రీవారికి బంగారు జరి వస్త్రాన్ని సత్యనారాయణరాజు, ఝాన్సీలక్ష్మి, స్వామివారి కల్యాణ మూర్తులకు సువర్ణ తాపడ ఆభరణములు సూర్యనారాయణ, నాగసుజని, దినేష్, సింధు, ఉత్సవ విగ్రహాలకు సువర్ణ తాపహార ములు లోహిత సాయిలక్ష్మి, నాగలక్ష్మి అందించారు. శ్రీవారికి పుష్ప కల్యాణ మండపం ఆలయ కార్యవర్గసభ్యులు శ్రీకాంత్, స్వామివారికి కల్యాణోత్సవం పుష్పాలంకరణ, అన్నప్రసాదవితరణ ఆలయ ప్రధాన కార్యదర్శి సుభాష్, హనుమత్ వాహనసేవ రామకృష్ణశర్మ, బాబు సత్యసాయిలు చేశారు. దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అడుగడుగునా బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం..



పాపిరెడ్డి కాలనీలో ఇంటింటి ప్రచారంలో కార్పొరేటర్ రాగం నాగేందర్

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో అడుగడుగునా బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారు. ఆదివారం పాపిరెడ్డి కాలనీ అంబేడ్కర్ విగ్రహం నుంచి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ.. సీఎం కేసీఆర్ చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీలు కలిసి నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు లేకుండా ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి 150 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. డివిజన్ అధ్యక్షులు రాజుయాదవ్, యువజన నాయకులు రాగం అనిరుధ్‌యాదవ్, నాయకులు కొండల్‌రెడ్డి, రాజేశ్వరమ్మ, లింగారెడ్డి, రమేష్, వేణుగోపాల్‌రెడ్డి, రమణయ్య, ప్రభాకర్‌రెడ్డి, రాంబాబు, శ్రీకళ, పర్వీన్‌బేగం, సాయినందన్‌ముదిరాజ్, తలారి విజయ్, రాజశేఖర్, అనిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఇందేశంలో ఇంటింటి ప్రచారం
- మహిపాల్ రెడ్డికి మద్దతు తెలిపిన వెలమ, రాయలసీమ సంఘం
- రామచంద్రాపురంలో బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు



పటాన్‌చెరులో మైనార్టీ సమ్మేళనంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

పటాన్‌చెరు టౌన్: మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు పెద్దపీట వేస్తుందని ఇందుకు పటాన్‌చెరు నియోజకవర్గం ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైనార్టీ ఫంక్షన్ హాల్లో శనివారం రాత్రి నిర్వహించిన పటాన్‌చెరు మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ భారీగా నిధులు కేటాయిస్తున్నారన్నారు. తన సొంత నిధులతో వందకుపైగా మసీదులు, దర్గాలు, ఐదు ఎకరాల్లో కబ్రస్తాన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

వెలమ సంక్షేమ సంఘం ఏకగ్రీవ మద్దతు

పటాన్‌చెరు: బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి వివిధ కుల సంఘాల ఏకగ్రీవ మద్దతులు కొనసాగుతున్నాయి. తాజాగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వెలమ సంక్షేమ సంఘం ఎమ్మెల్యేకు ఏకగ్రీవ మద్దతు పలికింది. ఆదివారం పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన వెలమ సంక్షేమ సంఘం (అమీన్‌పూర్) ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం భేదం చూపకుండా సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

రాయలసీమ సంక్షేమ సంఘం..

పటాన్‌చెరు టౌన్: తెలంగాణలో నివసించేవారు తెలంగాణ బిడ్డలేనని, వారి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో శనివారం రాత్రి నిర్వహించిన రాయలసీమ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కోసం వచ్చి పటాన్‌చెరు నియోజకవర్గంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారందరి అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్ పార్టీ బాధ్యతని అన్నారు.

ఇంద్రేశంలో ప్రచారం..

పటాన్‌చెరు: మండలంలోని ఇంద్రేశం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. శ్రీ సాయి కాలనీలోని సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కాలనీలోని ఇంటింటికి వెళ్లి కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం ఇంద్రేశం గ్రామ పరిధిలో రూ.20 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

అగ్నికుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజయానికి సహకరిస్తామని పటాన్‌చెరు నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ కులస్తులు ప్రకటించారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన అగ్నికుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్, శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంపై పూర్తి నమ్మకంతో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయానికి అగ్నికుల క్షత్రియులు ఏకగ్రీవ మద్దతు ప్రకటించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, పార్టీ సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఏర్పాటులో యువత పాత్ర కీలకం


రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన యువత నేడు బంగారు తెలంగాణ రూపకల్పనలో ప్రధాన భూమిక పోషిస్తోందని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన టిల్లు, కార్తీక్, శ్రీకాంత్, ప్రమీల, తదితరులు తమ అనుచరులతో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం


పటాన్‌చెరు: బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యుడు, బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని జీఎంఆర్ సెంటర్‌లో అమీన్‌పూర్ మండలం సుల్తాన్ పూర్, పటాన్‌చెరు మండలం చిన్నకంజర్ల, క్యాసారం గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలకు చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనాలు

పటాన్‌చెరు: నియోజకవర్గంలో నిర్వహిస్తున్న వివిధ కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనాల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బాలాజీ కన్వెన్షన్ సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు క్షత్రియులు, పటాన్‌చెరులో శ్రీకాకుళం సంక్షేమ సంఘం, శెట్టిబలిజ, వీరశైవలింగాయత్ కులస్తులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలకు హాజరయ్యారు. జీఎంఆర్‌కు కులసంఘాలు తమ మద్దతు ప్రకటించాయి.



ఇంద్రేశంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



రామచంద్రాపురం బొంబాయి కాలనీలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

కూచిపూడి నృత్యప్రదర్శన



శిల్పారామంలో కూచిపూడి నృత్యం చేస్తున్న దృశ్యం

మాదాపూర్ : కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం గాయత్రి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ గురువు డాక్టర్ జ్యోతి శేఖర్ శిష్య బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. గణేశ పంచరత్న, జయ జయ దుర్గే, దశావతారం, అంతా రామమయం, మండూకశబ్దం, రామ కోదండరామ, చక్కని తల్లికి, అలరులు కురియగా తదితర అంశాలను కళాకారులు గాయత్రి శేఖర్, ఈషా, షణ్ముక, సహస్ర, వైష్ణవి, నాగమణి, మీనాక్షి, దీప్తి, అన్విత పావని, సిరిఆరాధ్య, కీర్తన, అక్షయ, రిధి, రాధా, సాన్విక, కిన్నెర తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీసీ నుంచి కేబీఆర్ పార్కుకు సైకిల్ రైడ్



రాయదుర్గం : సైకిల్ రైడర్లు సైకిల్ రైడ్‌ను ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారు జామున గచ్చిబౌలిలోని హెచ్‌బీసీ బై సైకిల్ స్టేషన్ వద్ద ఈ సైకిల్ రైడ్‌ను ప్రారంభించారు. ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ టీమ్ పర్యవేక్షణలో ఈ బైసైకిల్‌రైడ్‌ను నిర్వహించారు. హెచ్‌బీసీ బైసైకిల్ స్టేషన్ వద్ద ఆరంభమైన ఈ రైడ్ మైండ్ స్పేస్ జంక్షన్ నుంచి మాదాపూర్ దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి మీదుగా లోటస్‌పాండు, కేబీఆర్ పార్కు వరకు నిర్వహించారు. అనంతరం అదే మార్గంలో తిరిగి గచ్చిబౌలిలోని హెచ్‌బీసీ బైక్‌స్టేషన్ వరకు ఈ సైకిల్‌రైడ్ కొనసాగింది. ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ వ్యవస్థాపకులు అశోక్ మాట్లాడుతూ.. ఆదివారం రోజు ప్రత్యేక సైకిల్‌రైడ్‌ను ఉదయం 5.30 ప్రారంభిస్తారని, ఆసక్తి ఉన్న సైకిల్ రైడర్లు పాల్గొనవచ్చన్నారు. రైడర్లు నేరుగా హెచ్‌బీసీ బైసైకిల్ స్టేషన్‌కు రావొచ్చని, ఇక్కడ సైకిళ్లు సిద్ధంగా ఉంటాయన్నారు.

హుషారుగా..'గేమ్'..ఓవర్

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని హెచ్ఐసిసిలో జరుగుతున్న 3 రోజుల ఇండియా గేమ్ డెవలపర్ కాన్ఫరెన్స్ (ఐజీడిసి) ముగిసింది. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 4వేల పైగా ఔత్సాహిక్ గేమ్ రూపకర్తలు, వేల సంఖ్యలో గేమింగ్ స్టూడియోలు, డిజైన్ ఇన్‌స్టిట్యూట్స్ ప్రతినిధులు హాజరయ్యారని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ఈవెంట్‌లో భాగంగా అప్ కమింగ్ గేమ్ ఆఫ్ ద ఇయర్ అవార్డ్, మోస్ట్ పాపులర్ గేమ్ అవార్డ్...తదితర పురస్కారాలు అందజేశామని తెలియజేశారు.

నేటి నుంచి 'మనూ'లో ఆజాద్ జయంతి వేడుకలు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆజాద్‌డే వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం నుంచి ఈనెల 11 వరకు స్వతంత్ర భారత మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను ఆజాద్ డే వేడుకల పేరిట ఆరు రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించారు. ఫలక్‌నామా సమీపంలోని వట్టేపల్లిలోని 'మనూ' మోడల్ స్కూల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ అధ్యక్షత నిర్వహిస్తారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ పాల్గొంటారు. 10న ఉదయం 9.30 గంటలకు డీడీఈ ఆడిటోరియంలో ఆజాద్ స్మారక ఉపన్యాసం ఉంటుంది. ఢిల్లీలోని బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సలీల్ మిశ్రా 'మౌలానా ఆజాద్ మేకింగ్ ఆఫ్ మోడర్న్ ఇండియా' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

రూ.9వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా !



మయూరినగర్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.9 వేలకోట్ల నిధులతో అభివృద్ధి చేశానని, మరోసారి తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్‌లోని మయూరీనగర్ కాలనీ వాసులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'అభివృద్ధి సంక్షేమం' అనే నినాదంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని వివరించారు. మరోసారి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమమే పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మియాపూర్ : జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని డీసీఎం వేగంగా వచ్చి ఢీ కొట్టి గాయాలపాలైన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని మైత్రినగర్ కాలనీలో నివాసముంటున్న ఎం. శివరాజ్ (46) స్థానికంగా మదినాగూడలో ఓ కళాశాలలో వాచ్‌మెన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కాగా ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో మియాపూర్ మదినాగూడలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఎదుట జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న సమయంలో ఆల్విన్ క్రాస్‌రోడ్డు నుంచి చందానగర్ వైపు వెళ్తున్న డీసీఎం(టీఎస్15యూఈ5406) వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో శివరాజ్ కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. క్షతగాత్రుడు చికిత్స పొందుతున్నట్లు గుర్తించారు. నిర్లక్ష్యంగా డీసీఎం నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని బాధితుడి కుమారుడు మహేష్ మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.